# థాంక్యూ! వదినమ్మా!

వీరాజీ

**నగరంలో గోధూళి సమయం ఉండదు. అంతా వాహనధూళిమయమే! పక్షులూ, ఉద్యోగపృక్షులూ ఇల్లు పారేటి వేళనే సాయంకాలం అంటా రక్కడ. అటువంటి ఈవెనింగ్ టైమ్‌లో కేశవరావు గారి ఇంట ముందు గదిలో రేడియో తుంటరి తెలుగు పాట ఒకటి దంచేస్తోంది. అది వంట ఇంట్లో నుంచి విన్న అనసూయమ్మకి ఒళ్లు మండిపోయింది.**

"ఏమే, చంచలా! చంచలా! అక్కడ ఎవరూ లేకుండానే రేడియో మోగిపోతున్నట్టుందే... చూడు!' ' అంటూ కూతుర్ని కేకేసింది.

"అబ్బ! నే నిక్కడే ఉన్నానమ్మా! కట్టేస్తున్నాలే!' ' అంటూ వెలుపలి నుంచి లోపలికి దూసుకువచ్చిన పద్దెనిమిదేళ్ల చంచల రేడియో వాల్యూమ్ తగ్గించింది. "పక్కింటి వాళ్లు వి.సి.పి. తెచ్చుకున్నారు, తొంగి చూద్దామనుకుంటున్నా!" నంటూ తల్లి వారిస్తుందో, లేదో గమనిద్దా మన్నట్లు అక్కడే నిలబడింది.

"దేనికీ వేళా పాళా లేకుండా పోయిందే నీకు! మీ వదిన ఇంకా రాలే దేమిటి? వస్తున్నదేమో చూడు!" అంటూ అనసూయమ్మ కేకేసింది.

"అబ్బ, వస్తుంది లేమ్మా! సందు కొన దాకా వచ్చి అక్క డుండిపోతుం దేమిటి?" అని విసుక్కుంది చంచల. అయితే తల్లికి వినబడేలా, గట్టిగా - "పార్వతొదినా! పార్వతొదినా! నువ్వు సందు కొస దాకా వచ్చావా, లేదా!" అంటూనే పక్కింటికి ఉడాయించింది. వాళ్లింట్లో చుట్టా లొచ్చారు. 'అతని కిద్దరు ఆమె కిద్దరు' సినిమా వేసుకుంటున్నారు మరి!

అంతలో బస్సందుకునే ప్రయాణికుడిలా వడివడిగా అడుగులు వేస్తూ పార్వతి ఇల్లు చేరుకుంది. ఆమె కుడి చేతిలో ఒక పొట్లం ఉంది. భుజాని కున్న వానిటీ బాగ్‌ని గుమ్మంలోనే తొలగించుకుంటూ సగం తెరచి ఉన్న వీధి తలుపు చూస్తూనే, "ఏమిటమ్మాయ్, చంచలా! తలుపేమో తీసుంది, ఇక్కడ ఎవ్వరూ లేరు. ఈ రేడియోకి కాళ్లొస్తాయేమో జాగ్రత్త!" అంటూ లోపలికి వెళ్లబోతుండగానే, వెనుక నుంచి ధడాలున గెంతి ముందుకి వచ్చిన చంచల - "ఇక్కడే ఉన్నాగా, వదినా! అమ్మ నీకోసం సందు కొస దాకా పోయి చూసి రమ్మంటేనూ..." అంటూనే పార్వతి చేతిలోని పొట్లం చూస్తూనే, సంబరపడిపోతూ "అమ్మోవ్! వది నమ్మోయ్! మా అన్నయ్య కేం తెచ్చావు? అన్నయ్య చిట్టి చెల్లెలు ఈ చంచల కేం తెచ్చావు?' ' అంటూ ఎగిరి పొట్లం లాక్కుంది.

"అయ్యో, పిచ్చపిల్లా! అది మిఠాయి పొట్లం కాదే! నా మాట విను ..!"

ఈ లోగానే చంచల పాకెట్‌ని చీల్చి చూసింది. "అబ్బ, ఛీ, పాడు! నీ పాత చెప్పులు ... స్వీట్ పాకెట్‌లాగా ఇంత అందమైన పాకెట్ కట్టుకొచ్చా వేమి టొదినా?"

"నే చెబుతూనే ఉంటినిగా! వస్తూంటే పాడు చెప్పులు తెగిపోయాయి. చెప్పులు కుట్టే వాడు కూడా పరిసరాల్లో లేడు. మా కొలీగ్ నీరజాక్షి బలవంతంగా పక్కనే ఉన్నషాపులోకి లాక్కుపోయి చెప్పులు కొనిపించింది."

అప్పుడు చంచల వదినగారి కొత్త జోళ్ల వైపు చూసింది. అంతలో అప్పుడే హడావుడిగా వచ్చిన శేఖర్ బాబు, వదినగారి మాటలు అర్థోక్తిలోనే అందుకుని, "ఆ చెమ్కీ సరి కొత్త జోళ్లు ఇంచక్కా వేసుకుని, పాత చెప్పులు పదిలంగా పాక్ చేయించుకుని, 'ఎలన్ డొనాల్డ్' వేసిన బంతిలాగా రయ్ రయ్‌మని ఇంటి కొచ్చేసింది మా వదినమ్మ!' ' అంటూ పూర్తి చేశాడు.

"భలే భలే వదినా! నీ కొత్త చెప్పులు ఝుమ్ ఝుమ్మ నున్నాయి. నే నొకసారి వేసుకుని చూస్తా నేం?" అంటూ చంచల వదినగారి పాత చెప్పులు పక్కన పడేసింది.

అనసూయమ్మ లోపలి నుంచి, "దా న్నింట్లోకి అడుగు పెట్టనిస్తారా, లేదా?" అంటూ వచ్చి, పార్వతిని చూసి, "కొత్త జోళ్లు కొనుక్కున్నావా, పార్వతీ? ఆఁ, బాగున్నాయి సుమా! ఎంతైం దేమిటి, రెండొందలైనా అయ్యుంటా యేం?" అంటూ వ్యాఖ్యానించింది. "అయ్యోరామా, నా మతిమండా! కాఫీ అయినా తాగకుండా గుమ్మంలోనే నిలబెట్టేస్తున్నా మేమిటి? పదమ్మా, పద! మీ మామయ్యగారు కూడా నీ కోసమే ... అర గంటైంది ... ఎదురు చూస్తున్నారు. ఫిల్టర్ వేసి ఉంచాను. కాఫీలు కలుపు. మీ ఆయన క్కూడా ఆ చేత్తోనే ఓ కప్పు ఫ్లాస్క్‌లో పోసుంచుకో! నీకు తెలుసుగా, వా డాఫీసు నుంచి క్లబ్‌కి పోయి, వస్తూనే ముందు కాఫీ, ఆనక భోజనం చేస్తాడు!" అంటూ కోడలికి వంటిల్లు అప్పగించి, నట్టింటి వైపు తిరిగింది.


"ఇదుగో నత్తయ్యా, కాళ్లు కడుక్కుని వస్తున్నా! వెధవది చెప్పులు తెగిపోయాయి. లేకపోతే అర గంట ముందే వచ్చేద్దును" అంటూ లోపలి గదిలో నుంచి బయటికి వస్తున్న మామగారి వైపు కూడా సంజాయిషీ చూపులు సారించింది.

"చూడమ్మా, పార్వతీ! ఒక్క చెంచాడు చక్కెర వేసి మరీ ఇవ్వమ్మా నాకు కాఫీ. మీ అత్తగారి ధర్మమా అని నాలిక మీద వెంట్రుకలు మొలుస్తున్నాయి!" అంటూ కేశవరావు ప్రాథేయపూర్వకంగా చూశాడు. తన భార్య అక్కడ నుంచి వెళ్లిపోవడం గమనించి - "ఒకప్పుడు ఈ కేశవరావుని అంతా 'స్వీట్‌టైగర్' అనేవాళ్లు తెలుసా? పహిల్వాన్‌లు మీసాల మీద నిమ్మకాయలు నిలబెడితే, నీ మామగారు తన మీసాల మీద తొక్కుడు లడ్లు నిలబెట్టే వాడు!" అంటూ మీసాల చాటున నవ్వేస్తూ, లో గొంతుకతో, "జాగ్రత్త! మీ అత్తగారి కళ్లు మాత్రం వంటింట్లోనే ఉంటాయ్!' ' అంటూ హెచ్చరించాడు.

ఆ విధంగా యు.డి.సి. సుబ్బారావు భార్య, అకౌంటెంట్ పార్వతి ఆఫీసు నుంచి వస్తూనే ఇంటి డ్యూటీ ఎక్కింది.

***

ఫ్రిజ్‌లో నీళ్ల సీసాలు నింపి పెడుతోంది పార్వతి. "ఏం టొదినా, ఫ్రిజ్‌లో నీళ్ల సీసాలు కూడా




నువ్వే పెట్టుకుంటున్నావా?" అంటూ వచ్చాడు శేఖర్. "ఆ సినిమా పిచ్చిది ఈ మాత్రం పని కూడా చేయకూడదా? ప్చ్... ప్చ్... ఆఫీసు నుంచి వచ్చిన దగ్గర నుంచీ మళ్లీ మర్నాడు ఉదయం ఆఫీసుకు పోయే దాకా నీకు రెస్టుండదు. ఇలా ఇవ్వు, నే సాయం చేస్తాను!"

పార్వతి ఏదో విషయం పసిగట్టేసినట్లు నవ్వేసింది. "బాబూ, శేఖర్ - ఆల్ రౌండర్! నీకు ఐస్ వాటర్ కావాలి. ఇందు, ఈ సీసా పట్టుకుని అవతలికి పో! వదినగారి మీద ప్రేమ అంతా 'డిగ్రీ' అన్న రెం డక్షరాలు సంపాదించాక చూపెడుదువు గాని. ఈలోగా - అసలే అది కందిరీగల పుట్ట, చంచల ఊసెత్తకు!" అంటూ బాగా చల్లబడ్డ నీళ్ల సీసా ఒకటి మరిదికి ఆప్యాయంగా అందించింది.

అంతలో రానే వచ్చింది సిసింద్రీ చంచల. కూనిరాగం తీస్తూ, "సహన శీలివమ్మా, వదినా! నువ్వా సుగుణశీలివమ్మా! అమ్మా! ... 'ఇంటికి దీపం వదినమ్మ' అని ఓ హిట్ పిక్చర్‌కి కథ రాస్తా నొదినా!" అంటూ శేఖర్‌ని చూసి, "ఏరా, చిన్నన్నాయ్! వదినకి మస్కా కొడుతున్నావు కదూ! నాకు తెలుసు. రేపు సండే క్రికెట్ మాచ్ ఉంది ... నో! పర్మిషన్ నాట్ గ్రాంటెడ్ టు గో!" అంటూ వదిన చాటుకి చేరుకుంది.

'గయ్యాళీ! సినిమా పిచ్చీ! నువ్వే వదినకి మస్కా కొట్టాలని వచ్చావు. 'చహన చీలివమ్మా, వదినా! చహన చీలివమ్మా' అని పాటలు పాడుకుంటూ. నాకు తెలియదనుకున్నావా, రేపు 'ఇంట్లో గయ్యాళి ఊళ్లో వయ్యారి' రిలీజ్ అవుతోందిగా! అందుకు అమ్మాయి గారి కాకా!'

"చుప్! కవర్ బాల్‌తో కూడా సెంచురీ కొట్టలేవు కానీ పేద్ద వెస్టిండియన్ వివియన్ రిచర్డ్స్‌లాగా పోజులు పెడతావు!"

చెల్లి మీదికి చొక్కా చేతులు మడుచుకుంటూ వస్తూ, 'నువ్వా నాకు వంకలు పెట్టేది!' అంటూ మాటల దండయాత్రకు ఉకించగానే పార్వతి వారించింది.

"అయిందా మీ ఇద్దరి గోలా? నా పని అయిపోయింది. మీ అన్నయ్య వచ్చే వేళయింది, ఇంకా డైనింగ్ టేబుల్ అమర్చాలి! ఊఁ, పదండి!'

వదిన మొహం ఎర్రగా అయిందని స్పష్టంగా కనిపించింది వాళ్లకి. అందుచేత ఇద్దరూ కలిసి,

"సారీ! వదినా!" అంటూ సన్నాయి నొక్కులు మొదలుపెట్టారు.

"కోపమా? వదినమ్మా ది గ్రేట్‌వి కదూ! సారీ!'
'

పార్వతి నవ్వులో కల్మషం లేని వాత్సల్యం తొణికిసలాడింది. "నీకు మాట్నీ, నీకు క్రికెట్ మాచ్ రెండూ శాంక్షన్డ్! ముందు కంచాల దగ్గరికి పదండి, 'ఫుడ్ బాల్' ఆడేయండి! ఆనక మీ అన్నయ్య వచ్చే వేళకి పుస్తకాలు తీసు ముందేసుకు కూర్చోవచ్చు!" అంటూ మామగారికి వక్కలు దంచి, తాంబూలం ముందుగానే అమర్చడానికి వెళ్లిపోయింది.

"థాక్యూ, వదినా! యూ ఆర్ గ్రేట్! యూ ఆర్ టాప్ జెడ్!" అన్నవారి మాట లామె పట్టించుకోలేదామె.

"ఏమిటో ... ప్చ్ ... నాన్న వక్క పొడి కూడా నమల లేడు కానీ, తాంబూలం మాత్రం వదిలిపెట్టడు."

"అమ్మ విన్న దంటే తంతుది. మనం ఇంచక్కా కాస్సేపు డాబా మీదికి పోదామా! ఈ లోగా న్యూస్ అయిపోతుంది."

00 00 00

పట్నవాసంతో వెన్నె లెవడు చూడగలడు? కానీ చంద్రుడు మాత్రం తప్పదు అన్నట్లు తళతళా వెన్నెల కాసేస్తున్నాడు. "మన డాబా మీదున్నంత ప్రైవసీ మరెక్క డుంటుందిరా చిన్నన్నాయ్! చూడు, ఆకాశంలో ఎన్ని ట్వింకల్ ట్వింకిల్స్ వెన్నెట్లో హాయిగా జలకా లాడుతున్నాయో!"

"ప్రైవసీ అంటే ... సుబ్బారా వన్నయ్య గదిలో ఉంటుంది. నీకూ, నాకూ అక్కడికి నో లైసెన్స్ కదా!"

"ఛీ! నోర్మూయ్! ఆ ఏకాంతం వేరు. అది వదిన కోసం. ఇంకో తుంటరి వదిన వస్తే నీకూ ఇస్తా రో ప్రైవేటు రూమ్!"

"నీ బొందలే! అన్నయ్య గదిలో వదినకి ఏకాంతం దొరుకుతుందని - సినిమా సీనులు పిక్కా పట్టే నువ్వు అనుకోవాలి. పక్క గదిలోనే అమ్మా, నాన్నా ... ఆ ఇద్దరికీ నిద్ర పట్టదు. నాన్నకి దగ్గు, అమ్మకి నీ పెళ్లి బెంగ! నాన్నని టాప్ గేర్‌లో ..."

""ఛప్! నోర్మూయ్! మధ్యలోకి నన్ను ఎందుకు లాగుతావ్?" సీరియస్‌గా మాట్లాడుతున్న శేఖర్ చెల్లెలి మాటలను పట్టించుకోలేదు. "పాపం, వదిన పగలంతా అలసిపోయి ఇంటికి వచ్చి మళ్లీ పనిచేసి మరింత డస్సిపో యుంటుంది. ఇట్టే నిద్ర పట్టేస్తుందామెకి. కానీ అదీ సరిగ్గా దక్కదు పాపం!"

"అదేం? అన్నయ్య డ్యూయెట్ అందుకుంటాడా?"

"ఊహుఁ, అన్నయ్య గుర్రు వినలేదా నువ్వ? తొలి జాములోనే 'ఎయిర్ కూలర్' లెవెల్ అందుకుంటుంది."

ఇద్దరూ నవ్వుకున్నారు. కానీ చంచల వెంటనే సర్దుకుని, "ష్... అమ్మ విన్నదో, వారం రోజులదాకా నీ వెంటబడి మరీ ఉతికి ఉతికి ఆరేస్తుంది, జాగ్రత్త!' ' అంటూ గప్‌చుప్ అయిపోయింది.

"వదిన చాలా మంచిది కదరా!" అంటూ ఏదో ఆలోచనల పడిన శేఖర్‌ని మళ్లీ కదిలించింది చంచల.

"ఎందుకూ? మనకి డబ్బు లిస్తోందనా?" స్వగతమా అన్నట్లుగా ఉందా ప్రశ్న.

"అఫ్‌కోర్స్..." చంచల ఒప్పుకున్నట్లు మొహం పెట్టింది.

"వదిన ఎంకరేజ్ చేయకపోతే మనం మన హాబీలను చంపుకునే వాళ్లం. ఆనక మనమూ చచ్చే వాళ్లం" అన్న చెల్లెలి మాటలకి, "వదినకు అన్నయ్య కన్నా జీతం ఎక్కువే వస్తుందట తెలుసా?" అని జవాబిచ్చాడు అన్న.

"అందుకనేగా తన అకౌంట్‌లో నుంచి మనకి అడిగినప్పుడల్లా పైస లిస్తుంది!"

"భలేవాడివిరా బాబూ శేఖర్ నువ్వు! వదినకి వేరే బాంక్ అకౌంట్ ఉం దనుకుంటున్నావా? సత్తెకాలపు సత్తయ్యా! అన్నయ్య బాంకులోనే అంతా వేసేసి, తనేవెూ పాకెట్ మనీ మాత్రం తీసుకుంటుంది. అంతే!" అంటూ తనకు తెలిసిన విషయం శేఖరాని కింకా తెలియదేమో అన్నట్లు చెప్పింది.

"మీ ఆడాళ్లకి పాకెట్‌లు ఉంటాయా? పాకెట్ మనీ ఏమిటీ? జాకెట్ మనీ అనాలి" నవ్వాడు శేఖర్.

"చప్! నోర్మూయ్! వదిన వింటే తంతుంది. అన్ పార్లమెంటరీ భాష వాడకు. వదిన చెప్పింది - వానిటీ బాగ్ మనీ అనాలట."

"కానీ మన వదినకి వానిటీ లేదు. ఉత్త బాగు మాత్రమే ఉంది. అందులోనే టమాటాలు, తోటకూర, కంద, చామ దుంపలూ కూడా పట్టేస్తాయి!" తన జోక్‌కి తనే మురిసిపోయాడు బాబూ శేఖర్.

"వదిన వడ్డించే ఉంటుందిరా, చిన్నన్నాయ్! కేకేస్తుందేమో, అ టో చెవి పెట్టు."

"నా చెవులు అసలు డైనింగ్ హాల్‌లోనే ఉన్నాయి."

"అవును, అందుకేగా నువ్వవ గొప్ప 'ఫుడ్ బాల్' ప్లేయర్ వయ్యావు!"

"అద్సరే కానీ, అందరికీ వడ్డించే వదిన, రాత్రి పూట అన్నయ్యకు వడ్డించేదేమి? అన్నయ్యకి అమ్మ పెడితే కానీ దిగవా ముద్దలు?" అక్కసుగా వ్యాఖ్యానించాడు శేఖర్.


"అందుకే మీ మగాళ్లు ఉత్త చవటాయ లన్నది - 'హీరో వెధవాయ్' అన్న సినిమాలోని హీరోయిన్ నైట్ క్వీన్. అందులో ఓ సృష్టి రహస్యం ఉంది. నే చెబుతా విను, తల్లి కడుపు చూసి పెడుతుందట. పెళ్లాం వీపు చూసి పెడుతుందట!"

"ఐ సీ! పోనీ అన్నయ్యకీ, వదినకీ కలిపి అమ్మ వడ్డించరాదా? ఐ హేట్ దిస్ డిస్క్రిమినేషన్."

"అదే కూడదు. అలా చేస్తే అమ్మ ఒక్కత్తే తినొద్దా? వా ళ్లిద్దరూ అత్తా కోడళ్లుగా కలిసి తింటారు. అలా తింటేనే అపథ్యాలు చేయరట! తెలిసిందా?"

"అయితే నీకు మొగుడు రావల్సిందేనే! నువ్వ గోంగూర పచ్చడి ముద్దలకి ముద్దలు మింగుతావు!'
'

"అమ్మా, బాబూ మోహన్ ... సారీ, బాబూ



శేఖర్! మన దగ్గర ఆ పప్పేమీ ఉడకవు! నే న్నా మొగుడితోనే కలిసి భోంచేస్తా నని మా గయ్యాళి అత్తయ్యకి ముందే వార్నిం గిచ్చేస్తా! నేను వదినలాగా ఆరడాక్స్ మిసెస్ ఇండియాని కాను!'' సీరియస్‌గా ముక్కుపుటాలు ఎగరేస్తూ అన్నది నేటి మిస్సిండియా చంచల.

అంతలో పార్వతి కింద నుంచి కేకేసింది - "అక్క డేం చేస్తున్నారు? చంచలా! శేఖర్! మీ అన్నయ్య గా రొచ్చేశారు, కిందికి దిగిరండి!''

***

2

పదడుగులు వేసే లోగా రెండు సార్లు గడియారం వంక చూసుకుని, కంగారుగా ఆఫీసు భవనం మెట్లు ఎక్కుతూంది పార్వతి. నగరంలో ఉదయం పది గంటల వేళ అంటే ఉక్కిరిబిక్కిరి సమయం.

అంతలో 'హాయ్, మిసెస్ పార్వతీ! హండ్రెడ్ మీటర్స్ హర్డిల్స్ పోటీలకు వెళ్తున్నారా?' అంటూ పార్వతి కొలీగ్ నీరజాక్షి వెనుక నుంచి కేకేసింది.

"హాయ్! మీ బస్సు కూడా లేటయిందా? మా బస్సుకి దారిలో ఉద్యమకారు లెవరో తెలియదు కానీ, అర గంట రాస్తా రోకోగాళ్లు అడ్డం పడ్డారు. ఎయిట్ థర్టీకి బయలుదేరిన దాన్ని ఇప్పటికి మెట్ల మీద కొచ్చి పడ్డా! రండి, త్వరగా!''

"నేను బస్సు కోసం చూసి చూసి విసిగి పోయి ఆటోలో వచ్చేశాను - నిత్యం చచ్చే వాళ్లకి ఏడ్చేవా ళ్లెవరన్నట్లుగా ఉంది. మీరు కూడా ఇంకా మెట్ల మీదే ఉన్నారుగా! అమ్మయ్య, ఇక పదండి! మొదట ఆఫీసులో పడి దుకాణాలు తెరిస్తే ఆన కో పావుగంట సేద దీరినా, నో ఆస్కార్!'' అంటూ కాస్త స్థూలకాయం కనుక రొప్పుతూ పార్వతి నందుకుంది నీరజాక్షి.

ఆ ఇద్దరూ సీట్ల దగ్గరకు చేరుకుని, ముందు సొరుగులు, బీరువాలు గబగబా తెరిచేసి, ఉస్సూరంటూ కుర్చీల్లో కూలబడ్డారు. ఇక పరవాలేదు, లేట్ మార్క్ తప్పించుకున్నట్లే!

నీరజాక్షి, పార్వతీ పక్కపక్కనే కూర్చుంటారు. అంత దోస్తీ కూడా ఉంది. కాకపోతే నీరజాక్షి దబ్బపండు ఛాయలో ఛమక్ చమక్‌గా మెరిసిపోతూ ఉంటుంది. ఆమె కింకా పెళ్లి అవలేదని వేరే చెప్ప నక్కరలేకుండానే పోల్చేస్తా రంతా.

సెక్షన్ హెడ్ రూము వవైపు చూస్తూనే, "సా రెప్పుడో రెడీ! మన ఈ సూపరింటెండెంటు బస్సు మాత్రం ఎప్పుడూ లేటవదు. ఆల్వేస్ బిఫోర్ టైమ్!' ' అంటూ కిలకిలా నవ్వుతున్న నీరజాక్షిని పార్వతి సైగ చేసి, "ష్...!'' అని హెచ్చరించింది. వెంటనే సర్దుకుని, "గుడ్ మార్నింగ్, సార్!'' అన్నది నీరజాక్షి. ఇంచుమించు ఆమెతో గొంతు కలుపుతూ పార్వతి కూడా తన వైపే వస్తున్న సూపరింటెండెంట్ గుర్నాథానికి గుడ్ మార్నింగ్ చెప్పింది.

నీరజాక్షి సానుభూతి, గౌరవం కలిపి ప్రదర్శిస్తూ, "బాయ్ లేడా, సార్? పిలిస్తే మేమే వవచ్చేవాళ్లంగా!'' అన్నది.

"బాయ్? వా డో బాయ్, నే నో ఆఫీసరు? వా డింట్లో గేదె ఈనిందిట, సి.ఎల్. పారేసి పోయాడు. మనకన్నా వాడే నయం!'' అంటూ పార్వతి నుద్దేశించి, "చూడమ్మా, పార్వతిగారూ! నిన్న మిమ్మల్నో ఫైలు పుటప్ చేయమన్నాను. అదేనమ్మా ... ఫైలు నంబరు 93/482-బి. అది రిమైండ్ చేద్దామనే వచ్చాను. ఇహ్హిహ్హి ..!'' అంటూ అనునయంగా నవ్వాడు.

"అదా! రెడీ చేశాను, సార్! మీరు పదండి, నేను తీసుకొస్తాను!'' అంది పార్వతి వస్తున్న నవ్వు నాపుకుంంటూ.

నీరజాక్షి కల్పించుకుని, "సార్! నన్ను పుటప్ చేయమన్న ఫైల్ 94/569-ఏ కదా! నిన్ననే సబ్‌మిట్ చేసేశాను, సార్!'' అన్నది.

"అయ్యో, ఎంతమాట ... నాకు జ్ఞాపకం ఉంది. నీ కేం తల్లీ! సంసారం అనే జంజాటంలో పడకుండా తప్పించుకున్నావు. లక్కీ ఫెలో!'' అంటూ గుర్నాథం తన కాబిన్‌లోకి దూరిపోయాడు,

నీరజాక్షి అతణ్ని పూర్తిగా వెళ్లిపోనిచ్చి, "చూశారా, పార్వతిగారూ! నేను లక్కీ ఫెలోనిట. ఇంతకీ మీ ఫైలు వాల్యూ ఎంతో? నాది కేవలం నూట యాభై రూప్యములు మాత్రమే!'' అంటూ కిలకిలా నవ్వింది.

పార్వతి సీట్లోంచి లేస్తూ, "నాదీ అంతే ననుకోండి, పాపం! సూపర్నెంటుగారి ఇల్లాలుచాలా దుబారా చేసే మనిషి. పిల్లలు సినిమా పిచ్చోళ్లు. లేకపోతే నిజం ఫైల్సే పుటప్ చెయ్యమని మన ప్రాణాలు తోడే వాడు. హుఁ, ఏం చేస్తాం? ఇచ్చేసి వస్తాను!'' అంటూ నిట్టూర్చింది.

"ఎనీ ప్రాబ్లెమ్?'' అనడిగింది నీరజాక్షి. ఆమెకి తెలుసు, పార్వతికి వేరే అకౌంట్ లేదు. అప్పు లివ్వాలన్నా, అదనపు ఖర్చులు పెట్టాలన్నా చాలా కష్టంగా ఉంటుంది పార్వతికి. భర్తకి చెబితే తన ఆఫీసు పరువే పోతుంది. చెప్పకపోతే, మరో ఇబ్బంది - బడ్జెట్ అడ్జెస్టు కాదు.

నీరజాక్షి ఆమె మనసు చదివినట్లు అన్నది - "అవును సుమా, అందుకే నేను అంటాను ఈ జాయింట్ ఫామిలీస్ పెద్ద హెడేక్ అని. మీ పేర్న బాంకు ఖాతా ఈ నెలాఖరున పెట్టి తీరాల్సిందే!'

"థాంక్యూ! అదేం వద్దు కానీ ..'' అంటూ లోపలికి నడిచింది పార్వతి. ఆ సమయంలో అప్రయత్నంగా పార్వతి పాదాల వైపు చూసింది నీరజాక్షి. ఆశ్చర్యపోయింది. 'ఇదేమిటి, నిన్న సాయంకాలమేగా ఈవిడకి బలవంతాన కొత్త జోళ్లు కొనిపెట్టాను!' అనుకుంది. సరే, లోపల నుంచి రానీ, ఇంటర్‌వెల్‌లో అడుగుదాం అనుకుంటూ తన పనిలో నిమగ్నమై పోయింది.

***

మధ్యాహ్నం టిఫెన్ బాక్సులు తెరిచి పెట్టుకున్నాక, 'మీ కో మెమో ఇద్దా మనుకుంటున్నాను'' అన్నది నీరజాక్షి.

"ఏం తప్పు చేశానుటా?'' అంటూ పచ్చడిలో వేలు ముంచి లొట్ట వేసింది పార్వతి.

"నిన్న సాయంకాలమే కదా, పార్వతీ దేవీ! మీరు ముఖమల్ చెప్పులు ధరించి ఠీవిగా, రాణీలాగా గృహోన్ముఖులై వెళ్లారు. ఔనా, మరి ఇప్పు డీ పాత చెప్పులనే ధరించి ఏల మమ్ములను హింసించుచుంటిరి? కొత్త చెప్పులు కరిచాయా, మీరు వాటిని మరిచారా?'' డ్రమెటిక్‌గా మాట్లాడింది నీరజాక్షి.

స్నేహితురాలి వాత్సల్యానికి కూడా మురిసిపోయిన పార్వతి అదోలా నవ్వేసింది. ఆ నవ్వులో వేదాంతం ఉంది, వేదనా ఉంది.

"అ దేం లేదు, బాస్! పొద్దున్నే తమాషా జరిగింది. దట్స్ వై దిస్ హేపెన్డ్!'' అంటూ మంచి నీళ్లు చప్పరించింది.

"తమాషానా? ఏ మా కథ?''

"అ దో పెద్ద ఫ్లాష్ బాక్, నీరజా!''

## జోక్

భార్యమీద బాగా కోపం వచ్చిన ఓ భర్త అలిగి బయటికి వెళ్లి, రాత్రయ్యేసరికి బాగా ఆకలివేసి, ఆవిడ చేసే వంటకాలు గుర్తొచ్చి నోరూరి ఇంటికి ఫోన్ చేశాడు: "హల్లో రాణీ... రాత్రికేం చేస్తున్నావ్ వంటకాలు?'' అడిగాడు హుషారుగా.

"విషం తయారు చేస్తున్నా'' అంది రాణి టకీమని.

"అయితే నీ కొక్కర్తికే చేసుకో. నేను బయట భోజనం చేస్తున్నా'' అంటూ హడావిడిగా ఫోన్ పెట్టేశాడు.

వి. బాలకృష్ణ (పామర్రు)


45 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

"ఐ లవ్ ఫ్లాష్ బాక్స్! గో ఎహెడ్! లెట్ మి సీ ఇన్ మల్టీ కలర్. సదరు ఫ్లాష్ బాక్ ఫస్ట్, అండ్ దెన్ ఏ కప్ ఆఫ్ టీ!" అన్నది హుషారుగా నీరజాక్షి.

* * *

ఉదయం 8 గంటలు ... ఆఫీసులు, స్కూళ్లు ఉన్న వాళ్లున్న ఇళ్లలో ఒక సన్నాహక యజ్ఞమే జరుగుతున్న వేళ, చంచల వణికే కంఠంతో, ధైర్యం పుంజుకుని, గట్టిగా "వదినమ్మోవ్! ఇవిగో నీ పాత చెప్పులు, చూసుకో! ఇంచక్కా టిప్ టాప్‌గా కుట్టించు కొచ్చేశా! హాయ్, వేసుకుని చూడు, ఎంత బాగున్నాయో?"

"అమ్మ దొంగా! పొద్దున్నే మా చంచలమ్మ కింత బుద్ధొచ్చిందేం చెప్మా? నా బాగ్ అందుకో ఎంతైందో తీసుకుందువు గాని ..." అంది పార్వతి.

"అది కాదొదినా, ఇవాళ నా ఫ్రెండ్ బర్త్‌డే ...'

'

ఆ పాటికి అత్త అనసూయమ్మ కూడా అక్కడికి వచ్చింది. చంచల - అమ్మా నువ్వు చెప్పవే అన్నట్లు తల్లి వైపు చూసింది. అనసూయమ్మ జోక్యం చేసుకోవడం ఇష్టం లేనట్లే మొహం పెట్టింది కానీ, కంఠంలో ఆదేశపూర్వక ధ్వని ఉంది.

"నే చెప్తానమ్మా, కోడలా! దాని ఫ్రెండ్ ఇచ్చే పార్టీకి ఈ ఒక్క సారికీ నీ కొత్త చెప్పులు వేసుకుని వెళ్తుందట. అదీ సందడి. అందుకనే ఉన్న పళాన పోయి వీధి చివర సెంటర్లో కూర్చునే తాత దగ్గర నీ జోళ్లు రిపేరు చేయించు కొచ్చింది. కాదు లేవే ..., సరి కొత్త జోళ్లు వదినెకు వాళ్ల ఫ్రెండ్ ఎంతో ఎంచి, చూసి కొన్నది అంటే కూడా వినకుండా మారాం పెడుతుంటే నేనే అన్నాను వదిన్నడుగు, దానిష్టం అని."

"మీరు భలేవా రత్తయ్యా! ఈ పాటి దానికి మీరు ఇంతలా చెప్పాలా?" అంది పార్వతి.

"అలా కాదు, నీ అభిమతమే నా అభిమతం. చిన్న దానికి చెమ్కీ చెప్పు లెందుకు, వద్దు అంటే, నేనూ అలాగే అంటాను. లేదూ, 'దాందేం భాగ్యం, వెళ్లనీ' అంటావో, అదీ నాకు సమ్మతమే. నే వస్తా ... అవతల వాడికి అన్నం వడ్డిస్తూ మధ్యలోనే వచ్చాను" అంటూ అనసూయమ్మ ముగించింది.

'నాకు చంచలకన్నా ఎక్కువా ఆ కొత్త జోళ్లు? నా కాలికి ఏ జోళ్లున్నా పరవా లేదు. రోజూ పోయే ఆఫీసుకేగా ... పైగా, నా ప్రయాణం అంతా బస్సులోనే. ఎక్కువ నడవాల్సిందీ లేదు'అన్నది పార్వతి.

పాత చెప్పులు కింద పడేసి కాళ్లకు తొడుక్కుంటే, "ఏయ్, పెంకి ఘటం! నీ ఫ్రెండుకి ఏదైనా గిఫ్ట్ కొనుకెళ్లు, ఇంద అరవై రూపాయలు' ' అంటూ ఆరు పదు లిచ్చి మరదలు నెత్తి మీద ఆప్యాయంగా ఓ మొట్టి కాయ సుతి మెత్తగా వేసింది.

"థాంక్యూ, వదినా! యు ఆర్ గ్రేట్! ప్లీజ్, అన్నయ్యకు చెప్పకు!" అంటూ, అంతలోనే డ్రమెటిక్‌గా, " 'ఆహా, వదిన జోళ్లు ఎంత గొప్పవి!' అంటూ ఓ పాట రాస్తాను వదినా!" అంది చంచల.

* * *

నీరజాక్షి - "హుఁ ..." అని దీర్ఘంగా నిట్టూర్చి అంది - బాగుంది మీ ఫ్లాష్ బాక్!"

పార్వతి లేచి నిలబడి, "శుభం! మరి టీ తాగుదామా?" అంటూ నీరజాక్షికి చెయ్యి అందించింది.

"సూపరింటెండెంట్‌గారు అన్న మాట నిజమే!' అంది నీరజాక్షి.

"దేనికి అన్న మాటలు?"

"అదే, సంసారం మహా నరకం అని. హమ్మో! కంబైండ్ ఫామిలీలు, జాయింట్ కుటుంబాలు - వీటికి దూరంగా ఇలా ఉంటేనే హాయి!"

" 'సహన శీలివమ్మా, వదినా! నువ్వు ...' అని పాడుతూ ఎదురొచ్చే అల్లరి పిల్ల మా మరదల్ని చూస్తే, మీ రీ మాట లనరు! ఈడూ, జోడూ అనేది జంట పదం, నీరజా! కొన్నిటి కోసం కొన్నిటిని అంకితభావంతో వదులుకోవాలి. నాకేం, ఐ యామ్ హేపీ లైక్ దిస్!"

వెక్కిరించింది నీరజాక్షి - "ఐ యామ్ హేపీ లైక్ దిస్సూ ... దిస్సట దిస్స్!" అని, 'ఇదేనా హేపీనెస్సు? చిల్లర వ్యసనాలకు లొంగిపోయి చీటికీ మాటికీ డబ్బులు పిండుకునే మరిదీ, మస్కా కొట్టి కొత్త జోళ్లు, కొత్త చీర కొనుక్కున్నప్పుడల్లా ఎత్తుకు పోయే సినిమాల పిచ్చి మరదలూ, భర్తకీ, మామ గారికీ పేకాట పిచ్చీ, అత్త గారికి బి.పి., ఆఫీసులో సూపరింటెండెంట్‌కి అప్పుల అవసరం ... నెలాఖరున జీతం సాంతం అయ్యగారికే అంకితం. కమిషన్ పారేసినట్లు మనకి కొంత పైకం! ఇదేనా సంసారం? దీన్నేనా 'గృహమే కదా స్వర్గ సీమ' అంటారు మీరు?'

"అంకితభావంలో గల ఆనందం తెలిస్తే మీ రిలా అనరు నీరజాక్షీ! తన, పర అనే తేడాలు, ఎల్లలు దాటిన తరువాతనే సంసారంలో అడుగు పెడతాం మనం. అందుచేత ఐ డోంట్ మైండ్ - పాత జోళ్లు అండ్ కొత్త ప్రాబ్లెమ్స్!"

నీరజాక్షి టీ సిప్ చేస్తూ, "ఇదేనా పెద్దలు 'ఇండియన్ కల్చర్' అంటూ పేరు పెట్టి పొగిడేస్తూంటారు?" అనడిగింది.

ఆమె మాటలు ప్రశ్నలలాగా లేవు. స్వగతంలాగా ఉన్నాయి. 'మీకు అత్త పోరు, ఆడపడుచు పోరు లేని సంసారం మీ ఇష్ట దైవం అందిస్తాడు కానీ, ఇప్పట్నుంచీ డోంట్ వర్రీ!' అంది పార్వతి.

'థాం క్యూ, వదినమ్మా! నువ్వు సహనశీలివమ్మా! ఇంకా ఎన్నో జోళ్లు నీవి అరగాలమ్మా!' అంటూ జోహా ర్లర్పించడాన్ని అభినయించి నీరజాక్షి ఖాళీ టీ కప్పును కాంటీన్ బాయ్‌కి అందించింది.

"వేళాకోళం కాదు, ఈ నెత్తిన పడ్డ నీళ్లు కింద కెంత సేపట్లో పడతాయని ... నే చూడక పోతానా నీ సంసారం!" పార్వతీ కొలీగ్‌ని సరదాగా పొట్టలో పొడిచింది. ఆ సంరంభంలో, నృత్యసరళిలో ఆమె చేసిన శరీరపు కదలికలకు పార్వతి పాత జోళ్లలో ఒకటి తట్టుకోలేక పోయింది. ఆ సంగతి పార్వతి వెంటనే గమనించ లేదు కూడా.

